



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎంఏ.గఫూర్, వేదికపై ఎండి.ఆనందబాబు

దోమలు బాబోయ్.. దోమలు...

అస్తవ్యస్థమైన డ్రైయినీజీ కాలువలు - వేళాపాలలేని కరెంటు కోతులు

ప్రజాశక్తి-పత్తికొండ

దోమలు బాబోయ్ దోమలు అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలం లోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు డ్రెయినేజ్ కాలువలు అస్తవ్యస్తం కావడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు వేళా పాలలేని విద్యుత్ కోతలు మరింత ఇబ్బందులకు గురి చేస్తుంది. పత్తికొండ, దూదెకొండ కొత్తపల్లి, పందికోన జూటూరు , చక్రాల, హోసూరు, కోతిరాల తదితర గ్రామాలలో కాలనీలో రోడ్లు లేక మురికి నీరు ఎక్కడపడితే చేరి దోమలు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇళ్లలోని రాత్రి వేళల్లో బాలింతలు ,చిన్న పిల్లలు , వృద్ధులు దోమలతో నిద్ర పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ మరిన్ని వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామాలలో కలుషిత నీరు వల్ల అతిసార వ్యాధితో అనేకమంది రోగులు బాధపడుతున్నారు. తూతూ మంత్రంగా గ్రామాలలో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుభ్రం చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టించుకోని ఎంపిడిఒ : పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీరు వల్ల అతిసార వ్యాధితో రోగులు బాధపడుతున్నారు. డ్రెయినేజీ కాలువలనుపై బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పురవీధుల్లో దోమలు స్ప్రే చేయడం పూర్తిగా మర్చిపోయారు. ఎంపిడిఒ వచ్చామా పోయామా అన్న విధంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. రోగాల భారిన పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు కోతలు.: వర్షాకాలం ప్రారంభంలో కరెంటు కోతలు ఇబ్బందికరంగా మారింది. చిన్నపాటి వర్షానికి గంటల తరబడి కరెంటు కోతలు విధిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్లల్లో దోమలతో ఉండలేకపోతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పత్తికొండలో రోడ్డు దుస్థితి

రోడ్లు సరిగా లేవు

బాధితుడు ఎరుకల నాగరాజు.. పత్తికొండ 17వ వార్డు



మా కాలనీలో రోడ్డు డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ఇంటి చుట్టుపక్కల స్మశానానికి వెళ్లే దారి ఉండడంతో దోమలతో భయాందోళనకు గురవుతున్నాం. బ్లీచింగ్ పౌడర్ చల్లడం ,దోమలమందు స్ప్రే చేయడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమసమాజ స్థాపనకు

ప్రతి కార్యకర్త కంకణబద్దుడవ్వాలి

సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బారత దేశంలో సమసమాజ స్థాపన కోసం ప్రతి కార్యకర్త కంకణబద్దులై పనిచేయాలని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎంఏ. గఫూర్ పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు కార్మిక కర్శక భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి. ఆనంద్ బాబు అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశంలో ఆపార్టీ కేంద్ర కమిటి సభ్యులు ఎంఏ. గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకరరెడ్డి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో పాలకులు మారుతున్నారు తప్ప ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. పాలకులు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టేలా ప్రజలు సుఖంగా జీవించేలా ప్రతి కమ్యూనిస్టు చేసే కృషి ద్వారానే ఈ దేశంలో సమ సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. నూతన టెక్నాలజీ అభివృద్ధి చెందుతూ వైద్యం అందరికీ అందుబాటులో ఉందని భ్రమిస్తున్న ఈ కాలంలోనే ప్రభుత్వ లెక్కల ప్రకారం మనిషి సగటు జీవిత కాలం 67.24 గా ఉందన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం కావాలంటే కడుపునిండా తిండి, ఆ తిండి సంపాదించగడానికి కావాల్సిన ఉపాధి అవసరమన్నారు. నేడు దేశంలో సంఘటిత అసంఘటిత రంగాలలోనూ ప్రజలు ఉపాధి దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు వేలం వెర్రి హామీలతో ప్రజలను మభ్యపెడుతూ నెగ్గుకొస్తున్నారని, అభద్రతాభావంలో ఉన్న ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత మనదేనన్నారు. ప్రజలను నిరంతరం కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చైతన్యాన్ని బయట నుండి కల్పిస్తూ, సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి. రాముడు, ఎం. రాజశేఖర్, ఎం. విజయ్, నగేష్, అరుణమ్మ, మధు, మోహన్, సీనియర్ నాయకులు ఇ. పుల్లారెడ్డి, నాగేశ్వరరావు, సుభాన్, కోడుమూరు మండల కార్యదర్శి గఫూర్ మియా, ఓర్వకల్లు మండల కార్యదర్శి నాగన్న, కర్నూలు మండల కార్యదర్శి పిబి.హుస్సేనయ్య, నాయకులు సుజాత, రషీదా, జయమ్మ, విజయమ్మ, వేనమ్మ, రాజు, అబ్దుల్లా, రాఘవేంద్ర, షరీఫ్, సాయిబాబా, నరసింహులు తోపాటు వివిధ మండలాలు పట్టణాల నుండి హాజరైన సిపిఎం నాయకత్వం పాల్గొన్నారు

రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో 2023 ఖరీఫ్, రబీ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతాంగానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వర్షాలు రాక సాగుచేసిన వేరుసెనగ, పప్పు శనగ, మిరప ,పత్తి ఆముదం, జొన్న ,కొర్ర, మొక్కజొన్న పొద్దుతిరుడు, పెసలు సద్దలు తదితరాలు సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు.. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కింద ఎకరాకు రూ. 10వేలకు తక్కువ కాకుండా ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదరావుకు ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం జిల్లా ప్రధాన కార్యరదర్శి జి.రామకష్ణ నాయకత్వంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, గొందిపర్ల మాజీ సర్పంచి జి ఆంజనేయులు తదితరులతో వినతిపత్రం అందజేశారు. జి. రామకృష్ణ మాట్లాడుతూ 2023లో ఖరీఫ్‌లో పంటలన్నీ దెబ్బతిన్నప్పటికీ 24 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇన్పుట్ సబ్సిడీ కింద కేవలం ఎకరాకు రూ.6,300 మాత్రమే ఇచ్చారన్నారని, రైతులందరికీ ఇవ్వలేదన్నారు. కనీసం ఇప్పుడు 18 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ రబీలోనైన ఎకరాకు కనీసం రూ.పదివేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సహాయం కింద రూ.20,000 రైతుల ఖాతాలో జమ చేసినట్లయితే ఎంతో ఉపశమనంగా ఉంటుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, వేదవతి, నగరడోనా ఆర్‌డిఎస్ హంద్రీనీవాకు పంట కాలువలు ఏర్పాటు చేస్తే కరువు నుండి బయట పడడానికి అవకాశం ఉందన్నారు. గుండ్రేవుల రిజర్వాయర్‌ను నిర్మించినట్లయితే కర్నూలు జిల్లాకు సాగు, తాగునీరు పరిష్కారం కావడానికి అవకాశం ఉందన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, నాయకులు ఆంజనేయులు , ఎ.కృష్ణ

జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసినట్లయితే గిట్టుబాటు ధరతో పాటు నిరుద్యోగ సమస్య కొంత పరిష్కారం కావడానికి అవకాశం ఉందన్నారు. పత్తికొండ టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే పేరుతో రైతుల నుండి భూములు తీసుకోవడం తప్ప వారికి న్యాయమైన పరిహారం ఇవ్వడం లేదన్నారను. వారిని ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, నూతన ప్రభుత్వం రైతులందరికీ న్యాయమైన నష్టపరిహార ఇవ్వడానికి బి.తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు దిన్నేదేవరపాడు నుండి ఆర్.కొంతలపాడు వరకు రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చి తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి ఓర్వకల్లు వరకు రిజర్వాయర్ నిర్మాణం చేసి స్టీలు పరిశ్రమకు నీళ్లు ఇచ్చేదానికి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారని, భూములు కోల్పోయిన రైతులకు మాత్రం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. గ్రీన్ కో కంపెనీ వారు కరెంటు సరఫరా కోసం పెద్ద టవర్స్ రైతుల పొలాల్లో వేస్తున్నారన్నారు. టవర్స్ వేయడం వలన భూముల విలువ పడిపోతున్నదని, రైతులతో సంప్రదించడం లేదన్నారు. సరైన నష్టపరిహారం ఇవ్వక పోగా దౌర్జన్యంగా టవర్స్ నిర్మాణం చేస్తున్నారని, వెంటనే పనులు నిలిపివేసి రైతులకు సరైన నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. జిఒ22ను తక్షణమే నూతన ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మధు, కృష్ణ మహేష్ తదితరులు ఉన్నారు.


ఆర్‌ఎస్ పెండేకల్లులో నరికి వేసిన చెట్లు

పెండేకల్లు ఆర్ఎస్‌లో చెట్ల నరికివేత

ఆందోళనలో ప్రయాణికులు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ జంక్షన్‌లో మంగళవారం రైల్వే సిబ్బంది చెట్లను నరికించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చెట్లను పెంచాలని, పర్యావరణాన్ని కాపాడాలని ఒక ప్రక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న ఇక్కడ పెండేకల్ ఆర్ఎస్ జంక్షన్‌లో మాత్రం రైల్వే సిబ్బంది యధాతథంగా చెట్లను నరికేయడం విచారకరం. గత కొన్ని సంవత్సరాల నుండి ప్రయాణికులకు నీడగా ఉంటున్న చెట్లును ఉన్నట్టుండి రైల్వే సిబ్బంది నరికి వేశారు. పెండేకల్లు ఆ రైల్వే జంక్షన్‌కు సుమారు 10 పల్లెల దాకా వివిధ ప్రాంతాలకు వెళ్ళుటకు చాలామంది ప్రయాణికులు ఈ స్టేషన్‌కు వస్తుంటారు. రైలు లేటుగా వస్తే ప్రయాణికులు చెట్ల కింద కొంతసేపు సేద తీరుతారు. రైల్వే సిబ్బంది మాత్రం ఉన్నట్టుండి పచ్చని చెట్లను నరికేయడం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. నరికి వేసిన రైల్వే సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


విశ్వభారతి హాస్పిటల్ ఆధ్వర్యంలో బొల్లివ్యాధిపై అవగాహన ర్యాలీ

విశ్వభారతిలో బొల్లివ్యాధి నివారణ దినోత్సవం

ప్రజాశక్తి- కర్నూలు అగ్రికల్చర్

అంతర్జాతీయ బొల్లివ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పెంచికలపాడు విశ్వభారతి వైద్య కళాశాలలో చర్మవ్యాధుల విభాగం ద్వారా బొల్లమచ్చల గురించి, కలశాలలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నర్సింగు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మ, ప్రొఫెసర్ హెడ్ డాక్టర్ ఉదయకుమార్, ప్రొఫెసర్ డాక్టర్ వీరేష్ లు మాట్లాడుతూ బొల్లి లక్షణాలు కనిపించినవెంటనే చర్మవ్యాధుల నిపుణుల ధగ్గర చికిత్స పొందాలన్నారు. బొల్లి మచ్చలు ఉన్న వారి పట్ల వివక్షత చూపకుడదని, బొల్లిమచ్చలకు దీర్ఘకాలిక చికిత్స అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి- వెల్దుర్తి



వెల్దుర్తి మండలం రామళ్ళకోట, పులగుమ్మి, బోయిన్‌పల్లి నరసపురం గ్రామాలలో నవభారత్ ఫర్టిలైజర్స్ ఎల్ఎల్‌పి ఫీల్డ్ ఆఫీసర్ బిటి రామానాయుడు ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రైతులకు సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు గురించి వివరించారు.సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించుకోవచ్చు అన్నారు. అధిక దిగుబడులను సాధించ వచ్చాన్నారు. రైతులకు అందించే సేంద్రీయ ఎరువులైనా, విజయ గ్రోమిన్ విప్రోమ్న్-5, జీవన ఎరువులైనా వి- గోల్డ్, 'సుప్రీమ్ లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "నవభారత ఫర్టిలైజర్స్ ఎల్ఎల్‌పి సంస్థ గత 20 సంవత్సరాలు రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు'లు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎఆర్ఎస్ఎం అయ్యస్వామి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్పు పట్ల టిడిపి హర్షం

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు , నాగరాజు యాదవ్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

వైఎస్ఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీగా వైసిపి ప్రభుత్వం పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన 20 నెలల తర్వాత అత్యధిక మెజారిటీ సీట్లతో అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశంలోనే ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీగా పేరు మార్చడాన్ని స్వాగతిస్తూ కర్నూలు జిల్లా టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నగర పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కె కె.బషీర్, పార్లమెంట్ ఎస్సి సెల్ అధ్యక్షులు ధరూర్ జేంస్ వారితో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్ యూనివర్సిటీపేరు మార్పు వల్ల ఇప్పటి వరకూ చదువుకుని సర్టిఫికెట్లు పొందిన వారు ఇబ్బందులు పడతారని అనేక మంది ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళే ప్రయత్నం చేసినప్పటికి, వైసిపి ప్రభుత్వం ఇవేమి పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించి ఎన్‌టిఆర్ పేరును తొలగించిందని అన్నారు. జగన్ రెడ్డి ఒక్క అవకాసం ఇవ్వండని ప్రజలను వేడుకోవడంతో మంచి చేస్తారని ప్రజలు అధికారం ఇస్తే, మంచి కంటే చెడు ఎక్కువ చేసి ప్రతిపక్ష హోదా కూడా పార్టీకి రాలేని స్థితికి దిగజారిందని అన్నారు. తండ్రిపై ప్రేమ ఉంటే యూనివర్సిటి స్థాపించి తండ్రి పేరు పెట్టుకోవాలని, ఉన్న పేరును తొలగించి తన తండ్రి పేరు పెట్టుకోవడం మంచిది కాదని అన్నారు. విదేశాలకు వెళ్ళే వైద్య విద్యార్థులకు కళాశాల పేరు మారడం వలన సాంకేతిక పరమైన సమస్యలు ఎదుర్కొంటున్న కారణంగా టిడిపి ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరిస్తూ డా నందమూరి తారక రామారావు ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీకి ఎన్‌టిఆర్ పేరుతో పునర్ నామకరణం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలవెంకటేశ్వరరెడ్డి, ఆదాము, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్‌కు నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

యాదవ కార్పొరేషన్ కు రూ.5000 కోట్లు ఇవ్వాలి

యాదవ హక్కుల పోరాట సమితి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : యాదవ కార్పొరేషన్‌కు రూ.5000 కోట్లు కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో యాదవ హక్కుల పోరాట సమితి పోలిట్ బ్యూరో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు మేకల రాములు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ యాదవ కార్పొరేషన్ కు రూ.5,000 కోట్లు ఫండ్ కేటాయించాలని, టిటిడి చైర్మన్ యాదవులకు ఇవ్వాలని, నామినేటెడ్ పదవులలో ప్రాముఖ్యం కల్పించాలని తీర్మానించామన్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను,రోడ్లు భవనాలు శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని, బిసి సంక్షేమ శాఖా మంత్రి సవితను కలసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు అయ్యన్న యాదవ్, గౌరవ అధ్యక్షులు జెవి.కష్ణయ్య యాదవ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు టువ్వా శ్రీరాములు యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేశ్వరావు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఈ శేఖర్ యాదవ్, జాతీయ కార్యదర్శి కె.శేషు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత కార్యకలాపాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్


మోసపూరిత బృందాలు అధిక రాబడిని వాగ్దానం చేయడం ద్వారా సున్నితమైన సమాచారాన్ని వినియోగదారుల నుంచి రాబట్టడంతో పాటుగా నిధులు తస్కరించే అవకాశం ఉందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సిడిఒ అండ్ సిఐఒ సందీప్ భరద్వాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ యూజర్ ఐడి , పాస్‌వర్డ్ వంటి ట్రేడింగ్ ఆధారాలు ఇవ్వవద్దని తమ కస్టమర్లను కోరుతోందన్నారు. పెట్టుబడిదారులు మోసపూరిత కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండటం, సమగ్ర పరిశోధన, విశ్వసనీయ సమాచారం ఆధారంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకమన్నారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీ నుండి వచ్చినట్లు చెప్పుకునే ఏదైనా కమ్యూనికేషన్ ప్రామాణికతను ఎల్లప్పుడూ ధవీకరించుకోండి. మీరు మా అధికారిక ఛానెల్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు జరుపుతున్నారని నిర్ధారించుకోండని అన్నారు. వాట్సాప్ లేదా ఏదైనా అనధికారిక ఛానెల్‌ల ద్వారా ఆధార్ లేదా పాన్ కార్డ్ వివరాలతో సహా వ్యక్తిగత సమాచారాన్ని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అభ్యర్థించదు అన్నారు. ఇంకా, వినియోగదారులు వాట్సాప్ గ్రూపులకు జోడించబడరు లేదా అధికారిక ప్లాట్ ఫారమ్‌ల వెలుపల నిధుల బదిలీ కోసం అభ్యర్థించబడరని వెల్లడించారు. అధికారిక హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెబ్‌సైట్ లేదా అధీకత యాప్ స్టోర్‌ల వంటి విశ్వసనీయ మూలాల నుండి మాత్రమే యాపులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్లెయిమ్ చేసే ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా గ్రూపులను కస్టమర్‌లు ఎదుర్కొన్నట్లయితే, వారు వెంటనే వాటిని నిర్దేశిత కస్టమర్ సేవాబృందానికి నివేదించాలని సూచించారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ కస్టమర్ సర్వీస్ 022-39019400లో సంప్రదించాలని సందీప్ భరద్వాజ్ కోరారు.

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు వెల్దుర్తి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-వెల్దుర్తి



ఈ నెల 27నుంచి 30 వరకు చెన్నైలో నెహ్రూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరిగే సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలకు వెల్దుర్తి పట్టణానికి చెందిన విద్యార్థి ఎరుకలి మహేష్ ఎంపికైనట్లు ఎబి బాక్సింగ్ అకాడమీ కోచ్ జె.ఫయాజ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ బాక్సింగ్‌లో పతకం తీసుకొని రాష్ట్రానికి, జిల్లాకు వెల్దుర్తి మండలానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ముఖ్యమైన ఈవెంటుకు ఎన్నికయినందుకు అభినందించారు. గతంలో స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి, గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధినించి మళ్ళీ ఇప్పుడు సౌత్ జోన్‌కు సెలక్ట్ అవడం ఎంతో గర్వంగా ఉంది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి మద్దిలేటి మాట్లాడుతు నా కుమారుడు ఈ స్థాయికి ఎదగడం సంతోషం వ్యక్తం చేశారు.



బాలలకు పౌష్టికాహారం సక్రమంగా ఇవ్వాలి

ప్రజాశక్తి- సి బెళగల్

అంగన్వాడీ కేంద్రాలలో బాలలకు పౌష్టికాహారం సక్రమంగా అందివ్వాలని ఇఒఆర్‌డి సందీప్ పేర్కొన్నారు. మంగళవారం పోలకల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆహారం వండేప్పులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం డయేరియా ప్రభలుతున్నందున అంగన్వాడీ విధుల్లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. బాలలకు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలపాలని సూచించారు.

గురుకులంలో మిగులు సీట్లకు 29న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్

జిల్లాలోని గురుకులాల్లో 6,8 తరగతులలో మిగులు సీట్లకు ఈ నెల 29 న ప్రవేశ పరీక్ష ఉంటుందని సిబెళగల్ ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు ఆధార్, స్టడీ పత్రాలతో ఫొటోతో సంబంధించిన సమీపంలో గల గురుకులాల్లో అందించాలని అన్నారు. శుక్రవారం హాల్ టికెట్ అందుకొని శనివారం పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధిస్తేనే సీట్ల వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితో కలిసి డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఆదోని పట్టణంలో పార్కింగ్ సమస్య ఎక్కువ ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ... ఆక్రమణకు గురైన ప్రభుత్వ రహదారులు, ప్రభుత్వ భవనాలను త్వరగా గుర్తించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో అధిక వర్షపాతం నమోదయ్యే సూచన ఉన్నందువల్ల లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకొని అవసరమైన మేరకు కొన్ని పరిస్థితులను సుమోటోగా కంప్లైంట్ తీసుకొని శాంతిభద్రతలు పరిరక్షించాలన్నారు. రామజల చెరువులో ప్రస్తుతం ఉన్న నీటిని తొలగించి వర్షపు నీటిని ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సిఆర్.శేషయ్య, ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి, ట్రెయినీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్ రెడ్డి, ఆర్‌టిఒ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, పోలీసు అధికారులు గోపి, నరసింహ రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

- కమిషనర్ రామచంద్రరెడ్డి



బసాపురం ట్యాంకులో నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణవాసులకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డితో కలిసి బసాపురం ఎస్ఎస్ ట్యాంకును, రాంజల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ప్రస్తుతం 750 మిలియన్ లీటర్ల నీటి నిల్వ ఉందని తెలిపారు. ఈ నీరు పట్టణవాసులకు నెల రోజులకు సరిపోతాయని చెప్పారు. అంతలోపు తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్ఎల్‌సికి తాగునీటి నిమిత్తం నీటిని సరఫరా చేయాలని తుంగభద్ర డ్యామ్ అధికారులను లెటర్ ద్వారా కోరామన్నారు. రాంజల చెరువులో నిల్వ ఉన్న నీటిని త్వరగా బయటికి తోడి శుభ్రం పనులు చేయిస్తామని తెలిపారు. వర్షం నీరు చెరువులో నిల్వ ఉంచి శుద్ధజలంగా మార్చి పట్టణ ప్రజలకు తాగునీటి నిమిత్తం ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?

- ఆదోనిలో అధ్వానంగా రోడ్లు - అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో రోడ్ల దుస్థితి అధ్వానంగా మారింది. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం.. గుంతలు తప్ప అన్న రీతిలో పరిస్థితి మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు మరింత వెడల్పుగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్లలో పడిన గుంతల్లో కనీసం గంప గ్రావెల్ కూడా వేయించలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు.



సిరుగుప్ప టర్నింగ్ రోడ్డులో గుంతల్లో నిలిచిన నీరు



కొత్త బ్రిడ్జి ఎక్కే ప్రాంతంలో పడ్డ గుంత

ప్రమాదకరంగా కొత్త బ్రిడ్జి

ఆదోని పట్టణంలోని రైల్వే నల్ల గేటు నుంచి మాధవరం రోడ్డుకు ఏర్పాటు చేసిన కొత్త బ్రిడ్జిపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. వేగంగా వచ్చే వాహనాలు గుంతలు గమనించకుండా అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. శ్రీనివాస్ భవన్ మీదుగా సిరుగుప్ప, మాధవరం రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు కొత్త బ్రిడ్జి మీదుగా సాగాల్సి ఉంది. బ్రిడ్జి ఎక్కే దశలోనే గుంతలు దర్శనమిస్తున్నాయి. అక్కడి నుంచి బ్రిడ్జి దిగగానే రెడ్ చిల్లి రెస్టారెంట్ వద్ద ఆర్‌టిఒ కార్యాలయం వద్ద ఆ గుంతల్లో బైక్‌లు, ఆటోలు, వాహనాలు నడిచేటప్పుడు ఫీట్లు చేయడం తప్పడం లేదు. రాత్రి వేళల్లో గుంతల్లో అటు ఇటు వాహనాలు తిరగాల్సి దుస్థితి ఉంది.

ఎమ్మెల్యే దృష్టికి రోడ్ల దుస్థితి

ఆదోని పట్టణ శివారు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితిని ఇటీవల ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అధికారులతో రోడ్ల పరిస్థితిపై చర్చించామని వివరించారు. ఆదోని శివారు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లపై పడిన గుంతలను పూడ్చేందుకు, బిటి ప్యాకింగ్ వేయించేందుకు రూ.1.80 కోట్లు అవసరం అవుతుందని అధికారులు తెలిపారని అన్నారు. సత్వరమే రోడ్ల పరిస్థితిని మెరుగుపరిచేలా శ్రద్ధ చూపాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

రేషన్ డీలర్‌షిప్ కోసం తెలుగు తమ్ముళ్ల ఆరాటం



డిప్యూటీ తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి ప్రభుత్వంలో పనిచేసిన రేషన్ డీలర్ షిప్ కోసం తెలుగు తమ్ముళ్లు ఆరాట పడుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఘోరంగా ఓటమి చవిచూసింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం తమదే అంటూ ఇక తహశీల్దార్లు తమ మాట వినాల్సిందేనని రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేసి తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మంగళవారం మండలంలోని చెట్నిహల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు డిప్యూటీ తహశీల్దార్ రాఘవేంద్రను కలిసి తమకు రేషన్ డీలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ... తహశీల్దార్ ఆదేశాల మేరకు చేస్తామని తెలిపారు.

కానిస్టేబుల్‌పై జూదరుల దాడి..?

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని అరికెర తండా గ్రామంలో ఆదివారం కానిస్టేబుల్‌పై జూదరులు దాడి చేసినట్లు సమాచారం. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఇద్దరు కానిస్టేబుళ్లు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వీడియో తీస్తుండగా జూదరులు ఒక్కసారిగా కానిస్టేబుల్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయం పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా ఉంచడం ఆశ్చర్యం కలిగిస్తోందని స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

డయేరియా నివారణకు చర్యలు

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

కలుషిత నీరు వల్ల డయేరియా వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని, జాగ్రత్తలు, నివారణ చర్యలు వివరించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో శానిటేషన్, హెల్త్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కలరా, డయేరియా, అతిసార, డెంగీ వంటి వ్యాధులు ఈ సీజన్‌లోనే వ్యాప్తి చెందుతాయని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా బారినపడి వాంతులు, విరోచనాలతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. జులై 1 నుంచి ఆగస్టు చివరి వరకు రెండు నెలలపాటు అతిసార నివారణ మాసోత్సవాలు జరుగుతాయన్నారు. వాంతులు, విరోచనాలు అయిన వారికి ఒఆర్ఎస్ తాపి జింక్ ట్యాబ్లెట్లు 14 రోజులు ఇవ్వడం వల్ల త్వరగా కోలుకుంటారని తెలిపారు. ఆ దిశగా జాగ్రత్తలు తీసుకొని క్షేత్రస్థాయిలో మెళకువలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు మహేష్, హర్షిత, వినోద్, అనిల్ సాగర్, గాయత్రి, సూపర్‌వైజర్లు జ్ఞానేశ్వరి, డోరతి, అరుణ, మేరీ, వార్డు హెల్త్, శానిటేషన్ సెక్రటరీలు ఉన్నారు.

గోనెగండ్ల : డయేరియాతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సోనీబాయి తెలిపారు. గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భారత ప్రభుత్వం డయేరియా నివారణ-2024 కింద జులై నుంచి ఆగస్టు వరకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ప్రణాళిక వివరాలు, దాని అమలుకు వివిధ శాఖల సిబ్బంది చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సర్పంచులు, స్థానిక విస్తరణాధికారులు, ఎఇ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సిహెచ్ఒలు, ఎంఎల్‌హెచ్‌పి, ఎంపిహెచ్ఒలకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించడం, చేసిన, చేయాల్సిన తేదీలను నమోదు చేయడం, బ్లీచింగ్ పౌడర్, గ్యాస్ క్లోరినేషన్ ద్వారా ప్రతి ఫిల్లింగ్‌కు క్లోరినేషన్ చేయాలని సూచించారు. అవశేషాలను పరీక్షించాలని, డ్రెయినేజీలో వేసిన పైపులైన్లను గుర్తించి తొలగించడం, కొత్త పైపులైన్ ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. తాగునీటిని ఎప్పటికప్పుడు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కిట్ల ద్వారా పరీక్షించాలని చెప్పారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు సంబంధిత వైద్య, ఆరోగ్య సిబ్బంది తగినచర్యలు చేపట్టాలని సూచించారు. ఇఒఆర్‌డి నాగేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రుక్సానా, ఎంఇఒ-1 రామాంజనేయులు పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యవతి



గోనెగండ్లలో మాట్లాడుతున్న అల్వాల సర్పంచి బాష



చదువుపై శ్రద్ధ అవసరం

- ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం విద్యార్థులకు అన్ని వసతులను ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని చదువుపై శ్రద్ధ కనబరిచి మంచి మార్కులతో విజయం సాధించాలని ఎంఇఒ సావిత్రమ్మ విద్యార్థులకు సూచించారు. మంగళవారం నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు మంచి విద్యాబోధన చేసే అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలన్నీ పంపిణీ చేశామన్నారు. షూ కూడా కొలతలు సరిగా లేనందున ఆలస్యమైందని, ఈ వారంలోపు షూ కూడా విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం ఉండాలని వంట ఏజెన్సీలకు సూచించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యేకు ఆర్‌వివిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో దరఖాస్తు చేసుకున్న ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థికీ సీటు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని ఆర్‌వివిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థినులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వలసలు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు హాస్టల్ సీటు కేటాయించకపోతే చదువు కుంటుపడే అవకాశముందని తెలిపారు. ఎక్కువ వలసలున్న ఆదోని డివిజన్‌లో కొత్త హాస్టళ్లు కేటాయించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉషారాణి, పర్వీన్, ఆదిలక్ష్మి, శిల్పా పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- వెలుగు పీడీ సలీం బాషా

ప్రజాశక్తి - చిప్పగిరి

పొదుపు సంఘాల్లో రుణాలు పొందిన మహిళలందరూ వారికి తోచిన ఏదో ఒక వ్యాపారం చేసుకొని లాభం పొందాలని జిల్లా వెలుగు పీడీ సలీం బాష గ్రామ సంఘాల మహిళలకు సూచించారు. మంగళవారం చిప్పగిరి శ్రీనిధి కార్యాలయంలో ఎపిఎం నాగార్జున ఆధ్వర్యంలో గ్రామ సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రుణాలు తీసుకొని సక్రమంగా కంతులు చెల్లిస్తున్న మండలాల్లో చిప్పగిరి మొదటి స్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. గ్రామ సంఘాల వారు తప్పనిసరిగా మీటింగులకు హాజరుకావాలన్నారు. రుణం పొందిన ప్రతి మహిళా జీవనోపాధిలో భాగంగా గొర్రెలు, మేకలు, జనరల్ షాపు, టైలరింగ్, ఎంబ్రాడింగ్ మిషన్లు నచ్చిన ఏదో ఒక వ్యాపారం ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. పొదుపు సంఘాల్లో మహిళా లీడర్లు ఎవరైనా తప్పు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎపిఎంగా విధులు నిర్వహిస్తున్న నాగార్జున మంచి ప్రతిభ కనబరుస్తున్నందుకు అభినందించారు. జిల్లాలో మహిళలు దాదాపు రూ.299 కోట్లు పొదుపు చేసుకున్నారని తెలిపారు. ఒక్కో మహిళ రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఎపి నవీన్, సిసిలు శారద, రాధమ్మ, లక్ష్మన్న, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాగులు అందజేస్తున్న పీడీ సలీం బాషా



నీటి నిల్వ కోసం నిర్మించిన కట్ట

అన్యాక్రాంతమైన భూమి పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి గ్రామ పొలిమేరలో అన్యాక్రాంతమైన భూమిని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఇరిగేషన్ ఎఇ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 35 సంవత్సరాల క్రితం రంగారెడ్డి కట్ట అనే పేరుతో వర్షపు నీటి నిల్వకు కట్ట నిర్మించారని తెలిపారు. నందవరం గ్రామానికి చెందిన మునిస్వామి తన పట్టా భూమి అంటూ సర్వే నెంబర్ 143సిలోని 6 ఎకరాల భూమిలో కరకట్టకు ఎడమ వైపు సుమారు 50-60 అడుగుల వరకు మట్టి కట్ట వేసుకొన్నారని చెప్పారు. దీనిపై రైతులు ప్రశ్నించగా 'నా ఇష్టం. నా పొలంలో నేను అడ్డుకట్ట వేసుకున్నా' అన్నట్లు మాధవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఇ కూడా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కట్టను పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించామని చెప్పారు. తుంగభద్ర నది వరదలో రికార్డులు తడిసి పోవడం వల్ల ఇరిగేషన్ శాఖ వారి దగ్గర ఉన్న రికార్డులను తెప్పించుకొని పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న తహశీల్దార్

గుండెపోటుతో జర్నలిస్టు మృతి

- అభిలాష్ మృతికి పలువురి నివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని హుసేనప్ప కొట్టాల, కలుగొట్ల రోడ్డులో నివసిస్తున్న జర్నలిస్టు కెజె.అభిలాష్ కుమార్ (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. అభిలాష్ సాక్షి దినపత్రికలో ప్రకటనలు విభాగంలో జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. అభిలాష్ కుమార్ మృతి విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు వై.ధరణిధర్ రెడ్డి మృతుని నివాసానికి వెళ్లి అభిలాష్ మృతదేహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు. అలాగే ఎపియుడబ్ల్యుజె నాయకులు బి.శ్రీనివాసులు, పరమేష్, రామకృష్ణ, శివ, జాలవాడి బాష, భీమన్నలు అభిలాష్ నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన కెజె.అభిలాష్ కుమార్ భార్య ఎమ్మిగనూరు నివాసి కావడంతో జీవనోపాధి కోసం హుసేనప్ప కొట్టాలలో స్థిర పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పట్టణంలో 26న సమాధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.



మృతుడు జర్నలిస్టు అభిలాష్ (ఫైల్)



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

వైభవంగా శ్రీజయతీర్థ న్యాయసుధా సంస్మరణోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీజయతీర్థ శ్రీమన్ న్యాయసుధ సంస్మరణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక శ్రీమఠంలో జయతీర్థుల చిత్రపటాన్ని, శ్రీమన్ న్యాయసుధ గ్రంథాలను స్వర్ణ రథంపై ఉంచి మంగళ హారతులు ఇచ్చి ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఊంజల మండపం వద్ద శ్రీమఠం పండితులతో శ్రీజయతీర్థుల బోధనలు, చరిత్ర గురించి ప్రవచనాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు కూడా అనుగ్రహ సందేశం ఇచ్చారు. శ్రీజయతీర్థుల అసాధారణ సాహిత్య రచనలను భక్తులకు చూపించారు. నవబృందావన గడ్డిలోని శ్రీపద్మనాభ తీర్థుల మూల బృందావన సన్నిధానానికి శ్రీజయతీర్థులు శ్రీన్యాయసుధ గ్రంథాన్ని సమర్పించిన రోజును గుర్తు చేసుకుంటూ ఉత్సవం విశిష్టతను వివరించారు. హాజరైన భక్తులందరినీ ఆశీర్వదించారు.



పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కోసిగి

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం కోసిగిలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో మంత్రాలయం తాలూకా కన్వీనర్ చింతకుంట నాగరాజు అధ్యక్షతన ఎంఆర్‌పిఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ, సుభాష్ చంద్ర మాదిగ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులుగా చింతకుంట సామ్యేల్ మాదిగ, మండల అధికార ప్రతినిధిగా వందగల్లు నరసింహులు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా చిదానంద మాదిగ, ఉపాధ్యక్షులుగా ప్రకాష్, ఈరన్న, సభ్యులుగా హనుమంతు, నరసింహులు, తిక్కస్వామి, నరసయ్య, లింగమూర్తి, రుద్రమునిని ఎన్నుకున్నారు. ఎంఎస్‌పి నాయకులు ఆంధ్రయ మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు మనోజ్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు దుర్గప్ప మాదిగ, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు కోడి ఉరుకుందు, ఈరన్న, తిమ్మయ్య, మూకయ్య, సామ్యేల్, కడపాలెం నరసయ్య పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి

- మంత్రి లోకేష్‌కు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో కాంట్రాక్టు ఉద్యోగులుగా గత 18 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులందరికీ 2024 డీఎస్సీలో రాష్ట్ర ప్రభుత్వం వెయిటేజీ కల్పించాలని సర్వశిక్ష ఉద్యోగులు కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకులు కె.పుల్లన్న మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ బిఇడి, టెట్ అర్హతలు కలిగి దశాబ్దాలుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న తమకు గత 12 ఏళ్ల నుంచి ఎలాంటి వేతనాలు ప్రభుత్వం పెంచలేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో కూడా ఎలాంటి వెయిటేజీ కల్పించలేదన్నారు. 2019 స్పెషల్ డీఎస్సీలో సమగ్ర శిక్షలో పనిచేసే ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ టీచర్లకు 5 శాతం వెయిటేజీ, సచివాలయ ఉద్యోగులకు 15 శాతం వెయిటేజీ కల్పించారని, అలాగే సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా గరిష్టంగా 20 శాతం వెయిటేజీని రానున్న డీఎస్సీలో ప్రభుత్వం కల్పించాలని కోరారు. సిఆర్‌ఎంటి సభ్యులు సుంకన్న, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు రామశేఖర్, రవికుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు